# ఆదర్శపురుషుడు

ఆ రోజుతో కల్పనకి ఇరవై ఏడేళ్ళు నిండుతున్నాయి. సరిగ్గా ఆ రోజే ఆమెకు జరుగుతున్న పెళ్ళిచూపుల తతంగం ఇరవై ఎనిమిదోది!

ఈ ఇరవై ఏడుగురు పెళ్ళి కొడుకులలో ఎవ్వరికీ ఆమె నచ్చక పోయినా ఆమె మనోస్థితిని మాత్రం పూర్తిగా ఛిన్నాభిన్నం చేశారనే చెప్పాలి.

పెళ్ళి చూపులంటే గొప్ప థ్రిల్ అప్పట్లో. పెళ్ళిచూపులంటే చిరాకు.... ఇప్పుడు! అయినా కిమ్మనకుండావచ్చిన ప్రతివాడి ముందూ తల వంచుకుని కూర్చోక తప్పడం లేదు!! దిగులుతో కుంగిపోతున్న తల్లిదండ్రులని చూసి ఆమె అలా తలవంచక తప్పడం లేదు! ! !

కల్పన ఇరవై ఒక్క సంవత్సరాలు వచ్చేప్పటికే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పాసయింది. ఇరవై రెండో ఏడే బాంక్‌లో ఉద్యోగాన్ని సంపాదించింది. తెలివితేటలకన్నా మించిన గొప్ప మనసుంది అయినా, ఆమె పెళ్ళి పెద్ద సమస్య అయికూర్చుంది.

కోరినంత కట్నాన్ని పువ్వుల్లో పెట్టి ఇవ్వడానికి కూడా ఆమె తల్లిదండ్రులు సిద్ధంగా వున్నారు. అయినా ఏ పెళ్ళికొడుకూ ముందుకు రాలేదు.

తనని ఇంత అంద వికారంగా పుట్టించిన దేవుణ్ణి తిట్టుకుంటూ పెళ్ళిచూపుల కోసం వచ్చే ప్రతివాడిముందూ తల వంచుకుని కూర్చోవడం తప్పడంలేదు కల్పనకి.

మొదట్లో ఎవరో ఒకళ్ళకి నచ్చకపోతానా అనే ధైర్యముండేది కల్పనకి. రాన్రాను అది తగ్గిపోతూ- ఇరవై ఎనిమిదో సంబంధం వచ్చే సరికి పూర్తిగా మృగ్యమైపోయింది.

తనకోసం కాకపోయినా తల్లిదండ్రుల బాధ చూసయినా కానేపు పెళ్ళిచూపుల నరకాన్ని భరించక తప్పదు.

అయిష్టంగానే మొహం కడుక్కుని చీర మార్చుకుని పెళ్ళి చూపు లకు తయారు కాసాగింది కల్పన.

ఎలాగూ వీళ్ళు నచ్చలేదంటారు. కాబట్టి, ముందు తనకే అతను నచ్చలేదంటే పోలా....?!

ఆమెలో వింత ఆలోచనాధోరణి ప్రారంభమైంది. రాబోయే పెళ్ళి కొడుకులో లోపాల్ని ఎలా ఎంచవచ్చు అని ఆలోచించసాగింది.

పెళ్ళివారు వచ్చారు.

ఇంట్లో హడావుడి పెరిగిపోయింది....

అందరిలోనూ కంగారు....

మామూలు ప్రకారం కాఫీ టిఫెన్లు పూర్తికాగానే అమ్మాయిని తీసుకు రమ్మన్నారు. తల్లి వెంటరాగా నెమ్మదిగా హాల్లోకివెళ్ళి తనకోసం వేసివుంచిన చాపమీద కూర్చుంది కల్పన.

అందరి చూపులూ తనమీదే వుంటాయి. తన అందవికారానికి నవ్వుకుంటారేమో! సిగ్గు, భయంతో ఆమె తల నేలకి కూరుకుపోసాగింది.

"నీ పేరేమిటి?" పెళ్ళికొడుకు అక్కగారు అడిగింది.

"నా పేరుకూడా కనుక్కోకుండానే పెళ్ళి చూపులకి వచ్చారా?" కల్పనకి కోపం వచ్చింది. ఆడబడుచు అర్ధ మొగుడు. తమాయించుకుని "కల్పన" అని నెమ్మదిగా జవాబిచ్చింది.

"ఏ బాంక్‌లో పని చేస్తున్నావ్?" పెళ్ళికొడుకు ప్రశ్న.

''పరాయి ఆడపిల్లని ఏకవచనంతో సంబోధించి మాట్లాడ డానికి సిగ్గు లేదూ?'' ఎదురు ప్రశ్న వెయ్యాలన్నంత కోపం వచ్చింది కల్పనకి.

సహనం స్త్రీకి ముఖ్యగుణం. తనెక్కడ పనిచేస్తున్నదీ అణకువగానే జవాబిచ్చింది.

పెళ్ళికొడుకు తల్లి, తండ్రి మరికొన్ని పెళ్ళిచూపుల రొటీన్ ప్రశ్న లని వేశారు. వాటికీ ఓపిగ్గా జవాబిచ్చింది.

''ఇక అమ్మాయిని లోపలికి తీసుకువెళ్ళండి.'' ఆర్డరిచ్చాడు పెళ్ళి కొడుకు తండ్రి.

తల్లి వచ్చింది- కల్పనని లోపలికి తీసుకువెళ్ళడానికి.

లోపలికి పోబోతూ అలవోకగా పెళ్ళికొడుకువంక చూసింది కల్పన.

అందగాడే!

కల్పన మనసు వెంటనే ఎదురు తిరిగింది. మనిషి ఎర్రగా వుంటే సరిపోతుందా? మొహంలో కళ వుండొద్దూ....?

నల్లగావున్న తన ముఖంలో కళ వుంది....అతన్లో ఆ కళ ఏదీ?

ఇప్పుడామెకి అతన్లో అందం వున్నట్లు ఏకోశానా అనిపించడం లేదు. తనకి అతను భర్తగా ఎంతమాత్రం తగడు....!

తన ఆలోచనా ధోరణి తనకే నవ్వు తెప్పించింది కల్పనకి. అయినా తప్పదు. రేపు వాళ్ళనుంచి వచ్చే జవాబుని తట్టుకోవాలంటే ఇలా ఆలో చించక తప్పదు.

''అబ్బాయి ఎలా వున్నాడమ్మా?'' పెళ్ళివారిని రోడ్డుమీదదాకా సాగనంపి లోపలికి వచ్చిన తండ్రి ఆప్యాయంగా అడిగాడు కల్పనని.

''నాకు నచ్చలేదు నాన్నా!....'' ఆమాటనేసి అక్కణ్ణుంచి చకచకా అవతలికి వెళ్ళిపోయింది కల్పన.

కూతురు ప్రవర్తనకి విస్తుబోయి చూస్తూ నిలబడిపోయారు తల్లి తండ్రి.

*　　*　　*

"ఇన్నాళ్టికి మనకి మంచి రోజులు వచ్చాయమ్మా!" ఆనందంగా ఇంటికి వచ్చిన తండ్రిని చూడగానే కల్పనకి ఆనందం కలిగింది.

ఎన్నాళ్టికి తండ్రి ముఖంలో ఆనందాన్ని చూస్తోంది తను!

"ఏమైందండీ....మొన్న చూసి వెళ్ళిన వాళ్ళు ఏమైనా చెప్పారా?" ఆత్రంగా అడిగింది అప్పుడే వంటింట్లోంచి వచ్చిన తల్లి.

"మన అమ్మాయి చాలా అదృష్టవంతురాలు....పిల్ల నచ్చిందన్నారు. త్వరలోనే ముహూర్తాలు కూడా పెట్టించమన్నారు...."

ఆనందంతో షాక్ తగిలినట్లయింది కల్పనకి. తను వింటున్నది నిజమేనా? తను అతనికి నచ్చిందా? తనని పెళ్ళి చేసుకోడానికి సమ్మతిని తెలియజేశారు. నమ్మశక్యం కాకుండాపోతోంది ఆమెకి.

రోజులు ఎవరికోసమూ ఆగవు. మంచయినా, చెడయినా పరుగెత్తుతూనే వుంటాయి.

కల్పన పెళ్ళి జరిగిపోయింది.

అంత అందగాడు తన భర్త! తలచుకొంటున్నకొద్దీ ఆమెలో తృప్తి పెరిగిపోయి గర్వంగా మారసాగింది.

అంత ఆనందంలోనూ ఆమెకి అర్థంకాని ప్రశ్న ఒక్కటే - ఇంత మందికి నచ్చని తను అతనికెలా నచ్చింది?

ఈ ప్రశ్నకి జవాబు చెప్పగలవాడు అతనే!

అందరూ మధురంగా వూహించుకునే మొదటి రాత్రి....

దాని గురించి ఎన్నో పుస్తకాల్లో చదివింది. ఎన్నో సినిమాల్లో చూసింది. ఇప్పుడు తన జీవితంలో చూడబోతోంది. కల్పన మనసు నిండా మధురమైన ఆలోచనలు.

రాత్రి పది దాటింది.

నెమ్మదిగా అతనున్న గదిలోకి అడుగు పెట్టింది. భయంతో వణుకుతున్న కాళ్ళని అదుపులో పెట్టుకుంటూ అక్కడే గుమ్మం దగ్గర నిలబడిపోయింది కల్పన.

చేతిలోని పుస్తకాన్ని ముందున్న టీపాయ్ మీదకి విసిరేసి చిన్నగా నవ్వాడతను.

కల్పనలో కంగారు పెరిగింది.

అతను నెమ్మదిగా లేచి ఆమె దగ్గరికి వచ్చాడు. అందంగా ఆమెని పొదివి పట్టుకుని, శబ్దం కాకుండా తలుపుల్ని లోపల గడియవేశాడు. ఆమె నలానే సున్నితంగా పట్టుకుని మంచం దగ్గరకి తీసుకువచ్చాడు.

అతని పక్కనే మంచం మీద కూర్చుంది ఆమె. ఏమేమో మాట్లాడాలని ఆమె మనసు ఉవ్విళ్ళూరుతోంది. నోట మాట రావడం లేదు.

"ఇక్కడ నేనొక్కణ్ణేగా వుంది. అంతగా సిగ్గుపడిపోతావేం? తల పైకెత్తు. మాట్లాడు." ఆమె చుబుకాన్ని పట్టుకుని సున్నితంగా తల పైకెత్తాడు అతను.

ఆమె చూపులు అతని చూపుల్ని కలుసుకున్నాయి.

"తన భర్త ఎంత ఆదర్శపురుషుడు!" ఆనందంతో ఆమె మనసు పులకించింది.

చటుక్కున ఆమెని అక్కున చేర్చుకున్నాడతను.

కాలం ఒక్క క్షణం స్తంభించింది.

ఇద్దరూ ఈ లోకంలోకి వచ్చారు.

"ఏమండీ....!" అతని గుండెల్లో తలదాచుకునే పిలిచిందామె.

"ఊఁ...."

"మీకు నేనంతగా నచ్చానా?" నెమ్మదిగా అడిగింది.

"నచ్చకపోతే ఎందుకు చేసుకుంటాను?...." చిన్నగా నవ్వాడతను.

తృప్తిగా గాలి పీల్చుకుంది కల్పన.

"మనిషికి అందంకాదు ముఖ్యం. మంచి మనసు.... అది నీకున్నది."

గర్వంతో పొంగిపోయింది కల్పన.

"నాది టూర్ల ఉద్యోగం. నెలలో ఇంట్లో వుండేకన్నా బయట తిరిగే రోజులే ఎక్కువ. అందమైన భార్య అయితే లేనిపోని అనుమానాలు. అదీ కాకుండా చుట్టుపక్కలవాళ్ళ అందరికళ్ళూ ఆమెమీదే వుంటాయి."

కల్పన నెత్తిన పిడుగులు పడ్డట్లయింది. అతను ఇంకా ఏమేమో చెప్పుకుంటూనే పోతున్నాడు. కానీ ఆమెకేమీ వినిపించడం లేదు. ఆ అందమైన పురుషుడి ఆదర్శం వెనుకనున్న రాక్షసత్వం ఆమెను నిలువునా కాల్చేస్తున్నట్లు ఫీలై, భయంతో జుగుప్సతో కళ్ళుతిరిగి వెనక్కి వాలిపోయింది కల్పన. *

(కలువబాల - పక్షపత్రిక, జూలై 1-15, 1985)